# జ్ఞాని

**చా**లా తెలిసినవాడు, మనిల్లు పావనం చేస్తున్నాడు. ఆయన్ని భక్తి శ్రద్ధలతో చూడాలి అని బాబుగారు హెచ్చరించారు. ఆయన చాలా విషయాల మీద – ముఖ్యంగా ఈనాటి సమస్యల మీద – మాట్లాడుతారు విందామని ఉవ్విళ్ళూరాం.

జ్ఞాని గారొచ్చారు. పెట్టే బేడా ఒక మూల సర్దుకుని తనకి కావల్సిన బట్టలూ అవీ తీసుకుని మళ్ళా పెట్టె భద్రంగా తాళం వేసి దాన్ని ఒకటికి నాలుగు సార్లు గుంజి చూసుకున్నారు.

"రైలునిండా ఏమి జనం? అబ్బబ్బ!" అన్నారు జ్ఞానిగారు. అందులో మాకు చాలా గూఢార్థం కనిపించింది. ఈ పైశాచిక యుద్ధాన్నీ, తన్మూలంగా యేర్పడ్డ రైళ్ళ కొరతనీ, రైలువాళ్ళ ప్రకటనలనీ, వాటికి విరుద్ధంగా జరుగుతున్న అనవసర ప్రయాణాలనీ, అందుచేత కలిగిన జన సమ్మర్దాన్నీ ఒక్క ముక్కతో విమర్శించేశారు.

"రైలునిండా ఏమి జనం!"

స్నానానంతరం జ్ఞానిగారు దేవతార్చనలో కూర్చునిపోవటం వల్ల మాకు వారి జ్ఞాన వాక్కులు భోజనానంతరంగానీ చెవుల బడలేదు.

హాయిగా తాంబూల సేవనం చేస్తూ జ్ఞానిగారు మంచంమీద విశ్రమించి నోరు తెరిచారు.

"ఎంచేతోగానీ ఎడంకన్ను ఊర్కే అదురుతోంది. ఏం రానుందోమరి! అంతా ఆ శ్రీరామచంద్రమూర్తివారి లీల! రామా! రామా!" అన్నారు.

"ఎడం కన్నా అండీ?" అన్నాడు మా రెండోవాడు చాలా అమాయకంగా.

"అవును, బాబూ, అంచేతే ఆలోచిస్తున్నాను, ఏఁవి గానున్నదా అని."

"వెనకండీ, మా స్నేహితుడొకడికండీ, ఇలాగే ఎడమకన్ను తెగ అదరటం మొదలుపెట్టిందండీ" అన్నాడు రెండోవాడు.

"అలాగా? ఏమయ్యిందో?" అన్నాడు జ్ఞాని.

"నిక్షేపంలా పరీక్ష పాసై ఊరుకున్నాడండి."

"అంతే? ఇంకేమీ జరగలేదూ?"

"జరక్కేంవండీ? ఎడం కన్నలా అస్తమానూ అదురుతూనే వచ్చిందండి."

"ఆc?"

"ఇంతలో వాళ్ళ ముసలమ్మ చచ్చి వాడిపేర ఐదెకరాలు రాసిచ్చి పోయిందండీ."

"అసంభవం!" అన్నాడు జ్ఞాని.

"దానికో చిన్న తిరుగుడొచ్చిందిలెండి" అన్నాడు మా రెండోవాడు. అభమూ శుభమూ ఎరగని మొహం పెట్టి "మ(రెణ్ణెల్లకల్లా మా స్నేహితుడండీ, ఆడపిల్లయిపోయాడండి. నలుగురు పిల్లల్ని కని ఇప్పుడు సుఖంగా ఉన్నాడు, ఉన్నది."

జ్ఞాని మా రెండోవాడికేసి విచిత్రంగా చూశారు. ఆఖరుకు "అబ్బాయి, కుర్రాళ్ళలా అబద్ధాలాడగూడదు. పెద్దవాళ్ళని హేళన చెయ్యకూడదు, కళ్ళు పోతాయి" అన్నారు.

గాలి ఘనీభవించుకుపోయినట్టయింది. జ్ఞాని తమ గొంతుతోటి వాయు స్తంభన చేసినట్టయిపోయింది.

ఆ నిశ్శబ్దంలో మా మూడోవాడు చిన్నగా మా రెండోవాణ్ణి, "ఆ మూతెలా వుందో కనిపిస్తున్నదిరా?" అని అడిగాడు.

"మసక మసగ్గా వుందిరా" అన్నాడు రెండోవాడు రహస్యంగా. మా నాలుగోవాడు సభ రక్తి కట్టినట్టుగా "హిహి!" అని నవ్వి అంతటితో పోనిచ్చాడు.

మర్నాడు మేం చాలా సేవజేస్తేనేగాని జ్ఞాని మాకు సుముఖులు కాలేదు. బాబుగారు కూడా మమ్మల్ని గట్టిగా కోప్పడ్డారు. కాని మేం చేసిన తప్పు గురించి తర్క వితర్కాలు మట్టుకు జరగలేదు.

❁ ❁ ❁ ❁ ❁

"ఈ యుద్ధం గురించి తమ అభిప్రాయమేమిటి?" అని బాబుగారు జ్ఞానిగార్ని అడిగారు.

"బాబూ, ఇదంతా ఈశ్వర కటాక్షం. భూభారం తీరడానికే వచ్చింది. సందేహం లేదు" అన్నారు జ్ఞాని.

"అవునండీ, భూభారం తరగడమెలాగండీ? మా సైన్సు పుస్తకాల్లోనండీ 'కన్సర్వేషన్ ఆఫ్ మేటర్' చెప్పారండీ. అంటే వందమంది మనుషులు చచ్చినా వాళ్ళ తాలూకు పదార్థం నాశనం కాదన్నారండి. ఎన్ని వేలమంది చచ్చినా భూమి బరువు యథాప్రకారంగానే వుంటుందని శాస్త్రమండి" అన్నాడు మా రెండోవాడు.

ఈసారి బాబుగారికోప్పమొచ్చింది. కానీ మరి ఆయనకి నవ్వు వచ్చింది. అంచేత జ్ఞాని గారాగ్రహించుకునే అవకాశం లేకపోయింది.

తరవాత బాబుగారు రాజకీయాల్లో ప్రవేశించారు. ఆయన కాంగ్రెస్ పక్షపాతి.

"ప్రపంచం తప్పుదుదారిన పడుతోంది. రాజకీయ సాధనాలు మార్చుకోక పోతే మానవజాతి ఇంకా అధోగతిలోకి పోయేలా కనిపిస్తోంది. ఈ అయోమయావస్థలో గాంధీజీ ఒక్కరే సరయిన రాజకీయ సాధనాలు చెప్పారు, సత్యాహింసలు, మీరేమంటారు?" అన్నారు బాబుగారు.

"బాబూ, ఒకటి చెబుతా వినూ! సత్యమే తెలుసుకుంటే అహింసేలేదోయ్! కౌరవ పాండవ యుద్ధారంభంలో అర్జునుడీ అహింసా తత్వమే అవలంబించగా శ్రీకృష్ణుడు సత్యం బోధించాడు. చంపేదెవరు? చచ్చేదెవరు? అంతా మిథ్య. ద్వంద్వాలని రాల్చేసుకున్నవాడికి అహింస ఏది? హింస ఏది? కర్తవ్యం గ్రహించి కర్తృత్వం విసర్జించడమే సరయిన మార్గం."

"కర్తవ్యం బోధ చేసేదెవరు?"

"అలా అడుగు మరి. యుద్ధం వచ్చింది. రాజకీయవేత్తలంతా ఉపన్యాసాలు చేశారు. మన మత గురువుల్నెవర్నయినా కర్తవ్యం ఏమిటని అడిగారా?"

"ఏవో సుమండి యూరప్‌లోనూ అక్కడా చూస్తే మత గురువులంతా మానవజాతిని అధోగతికే ఈడుస్తున్నట్టు కనిపిస్తోందిగానీ."

"అదే ఈనాటి విజ్ఞానంలో వున్న లోపం. ప్రతివాడూ చూసేవాడే, ప్రతి వాడూ గ్రహించేవాడే, ప్రతివాడూ నిర్ణయించేవాడే! భావ సాంకర్యం! మన కళ్ళ యెదుట కనిపించే జీవితంలో మంచి చెడ్డలూ, కలిమిలేములూ, కష్ట సుఖాలూ, కర్మచేత కలుగుతున్నాయని గ్రహించగల్గితే, ఇంత భావ సాంకర్యం ప్రబలకపోను" అన్నారు జ్ఞాని.

నాకు రోషం వచ్చింది.

"బెంగాల్‌లో క్షామం వచ్చి చస్తున్న వారంతా తమ పాపం కొద్దీ చస్తున్నారనీ, దొంగ వర్తకం చేసి కోట్లు గడిస్తున్నవారంతా తమ పుణ్యం కొద్దీ గడిస్తున్నారనీ తమ అభిప్రాయమా?" అన్నాను.

జ్ఞాని నామాట వినిపించుకోలేదు.

"ఇంగ్లీషు వారు ఏ పూర్వ పుణ్యం చేతో మనల్ని పరిపాలిస్తున్నారని ఎందుకను కోరాదు? మనం ఏనాడో చేసుకొన్న పాపం కొద్దీ దాస్యంలో వున్నామని ఎందుకు సరిపెట్టుకోరాదు?"

"నే కాదన్నానా?" అన్నారు జ్ఞాని.

"కర్మ మీద ఆధారపడి మనం అన్ని ప్రయత్నాలూ ఎందుకు మానుకోరాదు? అన్నమెందుకు వండుకోవాలి? గుడ్డలెందుకు కట్టాలి? పిల్లలకోసం చెట్లకూ చేమలకీ ఎందుకు మొక్కాలి? రోగాలకి చికిత్సలెందుకు? భూఃవి దున్నటమెందుకు? విత్తులు చల్లటం దేనికి? భగవంతుణ్ణి పూజించటం దేనికి? మడికట్టడం దేనికి? జపాలెందుకు? తపాలెందుకు?"

బాబుగారు మందలించారు. నేనన్న దానిలో తప్పేంవిటో నాకర్థం కాలేదు. నా ప్రశ్నలకి జ్ఞానిగారు చెప్పే సమాధానం లేకపోవటం తప్పు.

అయినా నేను తప్పు చేసినట్లుగానే భావించుకున్నాను. కారణం తెలీదు. ఇటీవల ఇంకా అనేకమంది జ్ఞానులతో నాకిలాంటి అనుభవమే అయింది. వాళ్ళతో మాట్లాడిన కొద్దీ నాలో అశాంతి జాస్తి అవుతున్నది.

ఒక జ్ఞాని రష్యా విముఖుడు. జర్మనీ రష్యామీద పడగానే రష్యా అయిపోయిందన్నాడు. రష్యాలో జర్మన్ విజయాలన్నింటినీ మూడింతలు చేసి స్వీకరించాడు, జర్మన్‌ల గెలుపు దాస్తున్నారన్నాడు. రష్యా జర్మనీ మీద గెలవసాగింది. అన్నీ అబద్ధాలన్నాడు. రష్యా గెలుపు సహం చేసి చూడనారంభించేడు. రష్యాలో జర్మన్‌లు తిరిగి పోతున్నట్లు స్పష్టమయింది. ఇతనికి, పాపం తన సొంత పొలాలు వరదల్లో పోయినంత బాధ కల్గింది. జర్మనులనే గెలిస్తే రష్యా ప్రపంచాన్ని మింగేస్తుందన్నాడు.

"రష్యా నీకేం ద్రోహం చేసిం"దనడిగాను. రష్యాలో దరిద్రంలేదు. రష్యాలో మైనారిటీలను దోపిడీ చెయ్యటంలేదు. మెజారిటీని దోపిడి చెయ్యటం అంతకన్నా లేదు. రష్యన్ ఆర్థిక వ్యవస్థలో సామ్రాజ్యాలు లేనిపోని భారం. అవశ్యకతని గుర్తించడం తప్ప మరో మతంలేదు. ఇవన్నీ సమర్థించటానికి బోలెడన్ని ఉదాహరణలిచ్చాను. జ్ఞానిని తృప్తిపరిచానా? కలలోకూడా అనుకోకండి. రష్యా గురించి అతనికున్న అభిప్రాయాలు ఖండించి అతనిలో ఆగ్రహమే రేపాను.

నాకు తృప్తి కలిగిందా? అదీ లేదు. తర్కం సహాయంతో నా విశ్వాసాలని సమర్థించుకోవటం నాకెందుకుతృప్తినివ్వదు? ఇలాంటి జ్ఞానుల్ని చూసి నవ్వే మా రెండోవాణ్ణీ మూడోవాణ్ణీ చూస్తే నాకు ఒక్కోసారి అసూయ కూడా ఎందుకు కల్గుతుంది?

నేను బాధపడుతున్న సంగతి బాబుగారు గ్రహించారు. ఆయన గుచ్చి గుచ్చి అడిగిన మీదట చెప్పేశాను.

"అబ్బీ, నీ తర్కం కేవలమూ ఒక సాధనం. అది నిన్ను ఇతర వ్యక్తుల్నించి వేరు చేస్తున్నంత కాలం నీకు మనశ్శాంతి లేదు. నీ విశ్వాసాలు ఇతర్లకి పంచడానికి వినియోగించినప్పుడే తర్కం ఉపయోగిస్తుంది. మీ కుర్రాళ్ళంతా ఏమనుకుంటున్నారో తెలుసుకోకపోవటం పూర్తిగా పొరపాటే. మొన్నటితో నాకు బాగా బుద్ధొచ్చింది. మీలాటి జ్ఞానుల్నింట్లో వుంచుకొని పైవాళ్ళని రప్పించటం తప్పేమరీ. నువ్వూ, నీ తమ్ములూ, మీ ఉద్దేశ్యాలు గల మీ స్నేహితులు మనింట్లోనే చేరి, నాతోటీ, మీ అమ్మతోటీ మాట్లాడుకుంటూ వుండండి" అని బాబు సలహా ఇచ్చారు.

***మొదటి ముద్రణ : ప్రజాశక్తి, 7 నవంబర్ 1945***